నేటి మ్యాచ్‌లు
నెదర్లాండ్స్ X శ్రీలంక — ఉ. 10.30 నుంచి — వేదిక: లక్నో
ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా — మ. 2.00 నుంచి — వేదిక: ముంబై

జగన్ జయకేతనం

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నిక

సమీప అభ్యర్థిపై ఉత్కంఠ విజయం • ఈ విజయం తెలంగాణ ప్రజలకు అంకితం
మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు జగన్ కృతజ్ఞతలు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో నూతన అధ్యాయానికి నాంది పడింది. ఇన్నాళ్లు అంతర్గత కుమ్ములాటలు, అవినీతి ఆరోపణలు, నిధుల గోల్‌మాల్‌తో మసకబారిన హెచ్‌సీఏ ప్రతిష్ఠను తిరిగి పునరుద్ధరించేందుకు సమయం రానే వచ్చింది. తమ ప్రాబల్యంతో హెచ్‌సీఏలో పాతుకుపోయిన పాతకాపులకు.. తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావేత్త అర్నపల్లి జగన్‌మోహన్‌రావు తనదైన రీతిలో చెక్ పెట్టాడు. అసలు ఎలాంటి అంచనాలు లేకుండా పోటీకి దిగిన తొలిసారే తన సత్తాఏంటో ప్రత్యర్థులకు రుచిచూపుతూ దిమ్మతిరిగే రీతిలో హెచ్‌సీఏపై తెలంగాణ జెండాను సగర్వంగా రెపరెపలాడించాడు. ప్రభుత్వ పెద్దల మద్దతుతో ప్రత్యర్థులను మట్టికరిపించిన జగన్ హెచ్‌సీఏలో జయకేతనం ఎగురవేశాడు. హెచ్‌సీఏ తెలంగాణ సొత్తు అని ప్రకటించిన ఆయన ఈ విజయం రాష్ట్ర ప్రజలకు అంకితమన్నారు. ఈ విజయానికి సహకరించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఎన్నికల్లో అర్నపల్లి జగన్ మోహన్‌రావు జయకేతనం ఎగురవేశారు. ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల ప్రక్రియలో జగన్(63) ఒక్క ఓటు తేడాతో సమీప అభ్యర్థి అమర్‌నాథ్(62)పై అద్భుత విజయం సాధించారు. నువ్వానేనా అన్నట్లు కొనసాగిన అధ్యక్ష పోరులో ఆఖరికి జగన్‌నే విజయం వరించింది. శుక్రవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా హెచ్‌సీఏ పాలకవర్గానికి ఎన్నికలు జరిగాయి. జాతీయ మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వీఎస్ సంపత్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 173 ఓట్లకు గాను 169 ఓట్లు పోల్ అయ్యాయి. మాజీ క్రికెటర్లు సాంద్రా బ్రెగెంజా, డయానా డేవిడ్, జతిన్ మెహతా (ఎయిర్ ఇండియా), వినోద్ గైర్వజయ్యారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పలువురు మాజీ క్రికెటర్లు వీవీఎస్ లక్ష్మణ్, ప్రజ్ఞాన్ ఓఝా, మిథాలీరాజ్ తమ ఓటు హక్కు వినియోగించారు. సాయంత్రం నాలుగు గంటలకు తొలుత కౌన్సిలర్ బెర్తుతో కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. క్రికెట్ ఫస్ట్ ప్యానెల్‌కు చెందిన సునీల్‌కుమార్ అగర్వాల్ 59 ఓట్లతో విజయం సాధించగా, యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ అభ్యర్థి అన్సార్ అహ్మద్(50) రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత జరిగిన కోశాధికారి పదవి కోసం యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏకు చెందిన సీజే శ్రీనివాసరావు 66 ఓట్లతో అగ్రస్థానంలో నిలువగా, సంజీవ్‌రెడ్డి(33) రెండో స్థానానికి పరిమితమయ్యాడు. సంయుక్త కార్యదర్శి పదవికి పోటీలో గుడ్ గవర్నెన్స్ ప్యానెల్‌కు చెందిన బసవరాజు(60) ఒక్క ఓటు తేడాతో చిట్టి శ్రీధర్(క్రికెట్ ఫస్ట్ ప్యానెల్)పై ఉత్కంఠ విజయం సాధించాడు. కార్యదర్శి పదవి..క్రికెట్ ఫస్ట్ ప్యానెల్ అభ్యర్థి దేవరాజ్(77)..హరి నారాయణ(49, యెనైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ)పై గెలిచాడు. ఉపాధ్యక్ష పదవి గుడ్ గవర్నెన్స్ ప్యానెల్‌కు చెందిన దల్జీత్ సింగ్(63) దక్కగా, శ్రీనివాస్(46) రెండో స్థానంలో నిలిచారు. మొత్తంగా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు నేతృత్వంలో హెచ్‌సీఏ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. బహుళ క్లబ్‌ల ప్రాతినిధ్యానికి చరమగీతం పాడుతూ 57 క్లబ్‌లపై మూడేండ్ల పాటు నిషేధం విధించారు. దీంతో ఇన్నాళ్లు హెచ్‌సీఏను జలగల్లా పట్టిపీడించిన కొన్ని వర్గాలకు అధికారం అందకుండా పోయింది.

హెచ్‌సీఏ కొత్త కార్యవర్గం

అధ్యక్షుడు	జగన్‌మోహన్‌రావు
ఉపాధ్యక్షుడు	దల్జీత్‌సింగ్
కార్యదర్శి	దేవరాజ్
సంయుక్త కార్యదర్శి	బసవరాజు
కోశాధికారి	శ్రీనివాసరావు
కౌన్సిలర్	సునీల్‌కుమార్

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన సోదరుడు జగన్‌మోహన్‌రావుకు శుభాకాంక్షలు. గ్రామీణ క్రికెట్ అభివృద్ధిపై దృష్టి పెడుతూ పదవీకాలం కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను.
- కవిత , ఎమ్మెల్సీ

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్‌మోహన్‌రావుకు అభినందనలు. మీ హయంలో మరిన్ని విజయాలు సాధించాలి. రానున్న భవిష్యత్‌లో ప్రతిభ కల్గిన యువకులకు క్రికెట్ కెరీర్‌గా మారాలి.
- హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి

అభిమానుల సంబురాలు

ఉప్పల్ స్టేడియంలో సంబురాలు అంబరాన్నంటాయి. జగన్‌మోహన్‌రావు అధ్యక్ష పీఠం దక్కించుకోగానే అభిమానులు పెద్దఎత్తున సంబురాల్లో మునిగి తేలారు. పోటీపడ్డ తొలిసారే ప్రతిష్ఠాత్మక పదవి సొంతం చేసుకోవడంపై ఫ్యాన్స్ ఈలలు, కేరింతలతో దుమ్మురేపారు. పటాకులు పేలుస్తూ డీజే చప్పుళ్ల మధ్య జగన్‌ను భుజాలపై ఎత్తుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అభినందనల వెల్లువ

హెచ్‌సీఏ అధ్యక్ష పదవికి జగన్ ఎన్నిక కాగానే పలువురు ప్రముఖులు అభినందనల్లో ముంచెత్తారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, సినీ నటుడు సోనూసూద్‌తో పాటు పలువురు రాజకీయ, క్రీడా, సినీ ప్రముఖులు జగన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ విజయం తెలంగాణకు అంకితం. ఈ విజయంలో వెన్నంటి నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు లభించింది. ముఖ్యంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు ఈ గెలుపును అంకితం చేస్తున్నాను. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తాను. గ్రామీణ ప్రాంత క్రికెటర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటాం. ప్రభుత్వ మద్దతుతో దేశంలో హెచ్‌సీఏను అత్యుత్తమ క్రికెట్ అసోసియేషన్‌గా తీర్చిదిద్దుతాం. **-జగన్ మోహన్ రావు**

ఓపెనర్ల ఊచకోత

శతక్కొట్టిన వార్నర్, మార్ష్.. ఆస్ట్రేలియా ఘనవిజయం



1 వన్డే ప్రపంచకప్‌లో మూడుసార్లు 150కి పైగా పరుగుల సాధించిన ఏకైక ప్లేయర్‌గా వార్నర్ చరిత్రకెక్కాడు.

బంతిపై పగబట్టినట్లు.. పాకిస్థాన్ బౌలర్లపై ఆజన్మ శత్రుత్వం ఉన్నట్లు.. బెంగళూరులో అడుగు పెట్టింది బాదడానికే అన్నట్లు.. ఆస్ట్రేలియా ఓపెనర్లు వార్నర్, మార్ష్ వీరంగమాడారు. కొడితే సిక్స్ లేదా ఫోర్ అన్నట్లు పాకిస్థాన్ బౌలింగ్‌ను ఊచకోత కోశారు! ఓపెనర్ల దంచుడుకు రికార్డులు బద్దలైనా.. ఆ తర్వాత కాస్త ప్రతిఘటన చూపిన పాకిస్థాన్.. కంగారూలను అడ్డుకోగా.. మంచి ఆరంభం లభించిన తర్వాత ఆ జట్టు ఛేదనలో తడబడింది. ఫలితంగా వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయాల తర్వాత కంగారూల పని అయిపోయినట్లే అని భావించిన వారికి చాంపియన్ ఆటతీరు ఎలా ఉంటుందో ఆసీస్ చేతల్లో చూపింది. పూర్తి సాధికారికతతో కదం తొక్కి పాయింట్ల పట్టికలో టాప్-4లోకి దూసుకొచ్చింది!



బెంగళూరు: చిన్నస్వామి స్టేడియం చిన్నబోయేలా ఓపెనర్లు శివతాండవం ఆడటంతో.. వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో ఆస్ట్రేలియా 62 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తుచేసింది. గత మ్యాచ్‌లో టీమ్‌ఇండియా చేతిలో ఓటమి పాలైన పాకిస్థాన్‌కు ఇది వరుసగా రెండో పరాజయం కావడం గమనార్హం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 367 పరుగులు చేసింది. విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ (124 బంతుల్లో 163; 14 ఫోర్లు, 9 సిక్సర్లు), బర్త్‌డేబాయ్ మిషెల్ మార్ష్ (108 బంతుల్లో 121; 10 ఫోర్లు, 9 సిక్సర్లు) సెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 259 పరుగులు చేశారు. 10 పరుగుల వద్ద వార్నర్ ఇచ్చిన క్యాచ్‌ను ఉసామా నేల పాలు చేయగా.. దాన్ని సద్వినియోగం చేసుకున్న డేవిడ్ భాయ్ పాక్‌పై వరుసగా నాలుగో సెంచరీ నమోదు చేశాడు. ఈ దంచుడు చూస్తే.. ఆస్ట్రేలియా మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనిపించినా.. ఆ తర్వాత వచ్చిన వారు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. మ్యాక్స్‌వెల్ (0) గోల్డెన్ డకౌట్ కాగా.. స్టీవ్ స్మిత్ (7), స్టోయినిస్ (21), జోష్ ఇంగ్లిస్ (13), లబుషేన్ (8) విఫలమయ్యారు. పాకిస్థాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 5 వికెట్లు పడగొట్టగా.. హారీస్ రవుఫ్ 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 45.3 ఓవర్లలో 305 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు అబ్దుల్లా షఫీఖ్ (64; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), ఇమాముల్ హక్ (70; 10 ఫోర్లు) అర్ధశతకాలు సాధించడంతో పాకిస్థాన్‌కు మెరుపు ఆరంభం లభించింది. ఒక దశలో 134/1తో నిలిచిన ఆ జట్టు ఆ తర్వాత పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (18), మహమ్మద్ రిజ్వాన్ (46), సౌద్ షకీల్ (30), ఇఫ్తికార్ అహ్మద్ (26), మహమ్మద్ నవాజ్ (26) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో జాంపా 4, కమిన్స్, స్టోయినిస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. వార్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

1 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా తరఫున అత్యధికంగా 5 సెంచరీలు చేసిన పాంటింగ్‌ను వార్నర్ సమం చేశాడు.

4 వరల్డ్‌కప్‌లో ఒకే జట్టు ఓపెనర్లు సెంచరీలు చేయడం ఇది నాలుగోసారి. ఉపుల్ తరంగ-దిల్షాన్ (శ్రీలంక) రెండుసార్లు, రోహిత్-రాహుల్ ఒకసారి ఈ ఫీట్ నమోదు చేశారు.

1 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా తరఫున ఇదే (వార్నర్- మార్ష్ 259) అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం. ఓవరాల్‌గా రెండోది. 2011లో లంక ఓపెనర్లు తిలకరత్నే దిల్షాన్-ఉపుల్ తరంగా 282 పరుగులు చేసి టాప్‌లో కొనసాగుతున్నారు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
న్యూజిలాండ్	4	4	0	+1.92	8
భారత్	4	4	0	+1.65	8
దక్షిణాఫ్రికా	3	2	1	+1.38	4
ఆస్ట్రేలియా	4	2	2	-0.19	4
పాకిస్థాన్	4	2	2	-0.45	4
ఇంగ్లండ్	3	1	2	-0.08	2
బంగ్లాదేశ్	4	1	3	-0.78	2
నెదర్లాండ్స్	3	1	2	-0.99	2
అఫ్గానిస్థాన్	4	1	3	-1.25	2
శ్రీలంక	3	0	3	-1.53	0

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 367/9 (వార్నర్ 163, మార్ష్ 121; షాహీన్ 5/54, రవుఫ్ 3/83), పాకిస్థాన్: 45.3 ఓవర్లలో 305 ఆలౌట్ (ఇమామ్ 70, అబ్దుల్లా 64; జాంపా 4/53, స్టోయినిస్ 2/40).

ముంబై బౌలింగ్ కోచ్‌గా మలింగ

ముంబై : ఇండియన్ ప్రీమియర్ లీగ్‌పై చెరగని ముద్ర వేసిన శ్రీలంక మాజీ పేసర్ లసిత్ మలింగ సొంత గూటికి చేరాడు. ఈ వెటరన్ బౌలర్ ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యాడు. న్యూజిలాండ్ దిగ్గజం షేన్ బాండ్ పదవీకాలం ముగియడంతో.. మలింగకు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు శుక్రవారం ముంబై ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. రోహిత్ సేన నాలుగు ఐపీఎల్ ట్రోఫీలు నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన మలింగ.. 17వ సీజన్‌లో మార్క్ బౌచర్, కీరన్ పోలార్డ్‌లతో కూడిన కోచింగ్ బృందంతో కలిసి పని చేయనున్నాడు. మార్క్, పోలీ, రోహిత్, జట్టు సభ్యులతో కలిసి పనిచేసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా. ముఖ్యంగా..16వ సీజన్‌లో ముంబై బౌలింగ్ యూనిట్ వ్యూహాలు నాకెంతో నచ్చాయి. యువకులతో నిండిన ముంబైకి త్వరితగతిన పుంజుకోగల సత్తా ఉంది అని మలింగ పేర్కొన్నాడు. 40 ఏండ్ల మలింగకు ముంబైతో 13 ఏళ్ల అనుబంధం ఉంది. 2008 నుంచి 11 సీజన్లు ప్లేయర్‌గా కొనసాగిన లలిత్.. 2018లో ముంబైకి బౌలింగ్ మెంటార్‌గా సేవలందించాడు. అనంతరం రాజస్థాన్ రాయల్స్ జట్టుకు 2022 - 2023లో ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే.

సెమీస్‌లో సింధు

థాయ్‌లాండ్ ప్లేయర్‌పై అద్భుత విజయం

ఒడెన్సే : భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో ఎదురన్నదే లేకుండా పోయింది. ఈ ఏడాది తొలి టైటిల్ వేటలో ఉన్న సింధు.. శుక్రవారం సుపనిందా కటెథోంగ్(థాయ్‌లాండ్)పై అద్భుత విజయంతో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి సెట్ నుంచే విరుచుకు పడిన సింధు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. రెండో సెట్‌లో మరింత దూకుడుగా ఆడి కేవలం 47 నిమిషాల్లోనే 21-19, 21-12 పాయింట్ల తేడాతో మ్యాచ్ ముగించింది. వారం క్రితమే ఆర్కిటిక్ ఓపెన్‌లో సెమీస్ చేరిన సింధు.. డెన్మార్క్ ఓపెన్‌లోనూ ఫైనల్ పోరుకు అడుగు దూరంలో నిలవడం విశేషం. ఫైనల్ బెర్తు కోసం కరోలినా మరిన్(స్పెయిన్), థాయ్ జూ యింగ్(చైనీస్ తైపీ) మ్యాచ్ విజేతతో సింధు అమీతుమీ తేల్చుకోనుంది.

పాండ్యా లేకుండానే

కివీస్‌తో పోరుకు హార్దిక్ దూరం

ఢిల్లీ : సొంత గడ్డపై జరుగుతున్న వన్డే వరల్డ్ కప్‌లో ఫేవరేట్ ట్యాగ్‌ను నిలబెట్టుకుంటూ.. వరుసగా నాలుగు మ్యాచుల్లో గెలుపొందిన భారత జట్టుకు పెద్ద షాక్. గాయం నుంచి కోలుకొని వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో కీలక పోరుకు దూరం కానున్నాడు. ఎడమ మోకాలి గాయంతో బాధపడుతున్న ఈ ఆల్ రౌండర్ ప్రస్తుతం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌తో గురువారం పుణెలో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ.. బంతిని ఆపబోయిన పాండ్యా ఎడమ కాలికి దెబ్బ తగిలిన విషయం తెలిసిందే. నొప్పితో విలవిలలాడుతూ మైదానం వీడిన అతడికి స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు పాండ్యాను ఎన్‌సీఏకు తరలించాం. అక్కడ బీసీసీఐ వైద్య బృందం పాండ్యా ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించనుంది. అందుకని అతడు శుక్రవారం జట్టుతో కలిసి ధర్మశాలకు వెళ్లలేదు. పాండ్యా నేరుగా అక్టోబర్ 29న ఇంగ్లండ్ మ్యాచ్‌కు వేదికైన లక్నోలో టీమ్‌ఇండియాతో కలుస్తాడు అని బీసీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా

ముంబై: ప్రపంచకప్‌లో పసికూనలు అనదగ్గ జట్ల చేతిలో చావుదెబ్బతిన్న రెండు జట్ల మధ్య సమరానికి వేళ్లైంది. అఫ్గానిస్థాన్ చేతిలో కంగుతిన్న డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్.. నెదర్లాండ్స్ చేతిలో అనూహ్య పరాజయం ఎదుర్కొన్న దక్షిణాఫ్రికా మధ్య ఆదివారం వాంఖడే వేదికగా మ్యాచ్ జరగనుంది. ఇప్పటి వరకు మెగాటోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ కేవలం ఒక్క దాంట్లోనే విజయం సాధించగా.. మరోవైపు దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల్లో రెండింట గెలిచింది. పేపర్ మీద చూసుకుంటే.. ఇరు జట్లలో స్టార్లకు కొదవ లేకున్నా వరల్డ్‌కప్‌లో లయ అందుకునేందుకు ఇంగ్లండ్ బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారు. స్టార్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ గాయం నుంచి కోలుకొని తిరిగి రావడంతో ఇంగ్లండ్ జట్టు బలంగా మారగా.. బెయిర్‌స్టో, మలన్, రూట్, స్టోక్స్, బట్లర్, బ్రూక్, వోక్స్ సమిష్టిగా సత్తాచాటాలని ఇంగ్లిష్ టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. ఇక ఈ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగుల రికార్డు బ్రేక్ చేసిన సఫారీలు డికాక్, మార్క్‌రమ్, మిల్లర్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.